ప్రజాశక్తి
ఆదివారం 30 జులై 2023
5
శ్రీ సత్యసాయి



పోలీస్ ఫైరింగ్ రేంజ్ స్థల పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీస్ ఫైరింగ్ రేంజ్ స్థలాన్ని శనివారం ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. స్థానిక బుక్కపట్నం-ముదిగుబ్బ ప్రధాన రహదారిలో బుచ్చయ్యగారిపల్లి సమీపంలో పోలీసు శాఖకు చెందిన స్థలాన్ని ఫైరింగ్ రేంజ్ కోసం ఎస్పీ పరిశీలించారు. నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లాలో పోలీస్ శాఖకి ఫైరింగ్ రేంజ్ ఏర్పాటులో బాగంగా బ్రిటీష్ కాలంలోనే పోలీస్ కార్యకలాపాల అవసర నిమిత్తం పోలీస్ శాఖకి కేటాయించిన 4.4ఎకరాల స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ వెంట ఎఆర్ డిఎస్‌పి విజయ్‌కుమార్, ఎఆర్ అడ్మిన్ ఆర్ఐ టైటాస్, పుట్టపర్తి రూరల్ సిఐ రామయ్య, బుక్కపట్నం ఎస్ఐ నరసింహులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఆగిపోయింది..!

- మొరాయించిన తిరుపతి ప్యాసింజర్ రైలు
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



నిలిచిపోయిన రైలు ఇంజిన్



రైలు ఇంజిన్‌ను మరమ్మతు చేస్తున్న రైల్వే సిబ్బంది

కదిరిదేవరపల్లి నుంచి రాయదుర్గం మీదుగా తిరుపతికి వెళ్లాల్సిన ప్యాసింజర్ రైలు(07589)ఇంజిన్ మొరాయించింది. శనివారం మధ్యాహ్నం ఈ రైలు కదిరి దేవరపల్లి వద్ద సాంకేతిక సమస్యలతో ఆగిపోయింది. దీనికి మరమ్మతులు చేసేందుకు రైల్వే ఇంజినీర్లు చాలా సేపు కష్టపడ్డారు. అయినా ఫలితం లేకపోయింది. రాయదుర్గం రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 3.50 గంటలకు చేరుకోవాల్సిన రైలు సాయంత్రం 6 గంటలైనా చేరుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నిత్యం ఈ రైలు కోసం కదిరిదేవరపల్లి నుంచి తిరుపతికి వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఆయా స్టేషన్లలో వేచి ఉంచారు. తిరుపతికి వెళ్లేందుకు ఉన్న ఏకైక ప్యాసింజర్ రైలు కావడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అందరూ కూడా ఇందులోనే రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి రైలు ఇంజిన్ మొరాయించడంతో ప్రయాణికులు అందరూ ఇబ్బంది పడ్డారు. ఇంజన్ ఎంత సరిచేసినా మరమ్మతు కాకపోవడంతో రైల్వే ఉన్నాతాధికారులు బళ్లారి నుంచి మరో రైలు ఇంజిన్‌ను కదిరిదేవరపల్లికి తెప్పించే ఏర్పాటు చేశారు. రాత్రి 9-00 గంటలకు బళ్లారి నుంచి ప్రత్యామ్నయ ఇంజిన్‌తో రైలు బయల్దేరింది. దాదాపు 6 గంటలు ఆలస్యం కావడంతో ఈ రైలు ద్వారా ప్రయాణించాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రజాశక్తి-రాయదుర్గం

కూలిపోయింది..!

- కుప్పకూలిన పాఠశాల భవనం
- సెలవురోజుకావడంతో తప్పిన ప్రమాదం



కూలిపోయిన పాఠశాల తరగతి గది



రెండు రోజుల క్రితం కూలిన గోడ

శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండల పరిధిలోని బాపనకుంటలో శనివారం నాడు పెనుప్రమాదం తప్పింది. ఈ పాఠశాల భవనం కుప్పకూలి పైకప్పుతో సహా కింద పడిపోయింది. మొహరం సందర్భంగా శనివారం సెలవు రోజుకావడంతో విద్యార్థులు ఎవరూ పాఠశాలలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఇందుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి... నాలుగు రోజుల క్రితం కురిసిన జడివానకు ఈనెల 27న గురువారం ఈ పాఠశాల భవనంకు ఓవైపున ఉన్న గోడ నేల కూలింది. ఆరోజు కూడా విద్యార్థులు వరండాలో కూర్చోవడంతో అప్పుడే ప్రమాదం తప్పింది. కాగ పాఠశాల పూర్తిగా కూలిపోతే గోడలకు గల ఇనుప కిటికీలు, తలుపులు పాడవుతాయన్న ఉద్దేశంతో గ్రామానికి చెందిన కొందరు శనివారం ఉదయం వాటిని తొలగించారు. కిటికీలు, తలుపులు తొలగించడంతో ఒక్కసారిగా పట్టుతప్పి పైకప్పు కూలిపోయింది. కాగా ఈ తరగతి గదిని 1986 అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అప్పుటి ఎంపీ ఎస్.రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే సద్దపల్లి వెంకటరెడ్డి దీనిని ప్రారంభించారు. గ్రామస్తులు, పాఠశాల కమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు దెబ్బతిన్న ఈ పాఠశాల భవనాన్ని మరమ్మతులు చేయాలని పలుసార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఈ తరగతి గది కూలిపోయింది.

ప్రజాశక్తి-నల్లమాడ

సాగునీటిపై మాటల యుద్ధం

- ఏమి చేశారంటూ పరస్పరం విమర్శలు
- చంద్రబాబు పర్యటన నేపథ్యంలో వాడీవేడిగా సవాళ్లు
- ప్రాజెక్టు పనులు మాత్రం ఎక్కడివేసిన గొంగళి అక్కడే..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాగునీటి ప్రాజెక్టులపై టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆగస్టు ఒకటవ తేదీ నుంచి రాయలసీమ ప్రాజెక్టులపై యాత్ర చేపట్టనున్నారు. ఆగస్టు రెండో తేదిన అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి టిడిపి హయాంలో సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతి తప్ప పనులు జరగలేదని ఆరోపించారు. అదే సమయంలో మాజీ మంత్రి పరిటాల సునీత గురువారం నాడు కాలువ వద్దకెళ్లి సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్నారు

ఇద్దరి హయాంలో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. పేరూరుకు ఎత్తిపోతల ద్వారా హంద్రీనీవా నుంచి పేరూరు డ్యామ్‌కు నీటిని అందించే పనులను అప్పటి ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబునాయుడు రూ.804 కోట్లతో 2018లో శంకుస్థాపనను చేశారు. దీనికి భూసేకరణ ఏదీ జరగకుండానే పనులను ప్రారంభించారు. 2019 ఎన్నికల నాటికి కూడా ఈ పనులు అనుకున్నంత వేగంగా ముందుకు సాగలేదు. 2019 ఎన్నికల్లో వైసిపి విజయం సాధించాక చెన్నెకొత్తపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణ ఒకసారి శంకుస్థాపన చేశారు. 2024 ఎన్నికల్లోపు మూడు ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఆనాడు ప్రకటించారు. కాని ఇప్పటికీ ఈ ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదు. దీనికి సంబందించి కూడా భూసేకరణ ఇప్పటికీ పూర్తవ లేదు. పనులు ముందుకు సాగలేదు. రాయదుర్గం నియోజకవర్గంలోని భైరవానితిప్ప ప్రాజెక్టు పరిస్థితి ఇదే రకంగా ఉంది. భూసేకరణకు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇటీవల జిల్లాకు వచ్చిన సందర్భంలో నిధులు విడుదల చేయడంతో నిర్వాసితుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నారు. కాని ఇక్కడ కూడా ప్రాజెక్టు పనులు మాత్రం ప్రారంభమవలేదు.



రామగిరి మండలం దుబ్బార్లపల్లి వద్ద ఆగిన జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు జలాశయంకు నీరందించే కాలువను చూపుతునన్న మాజీ మంత్రి పరిటాల సునీత

ఇద్దరి హయాంలోనూ అదే పరిస్థితి..

టిడిపి, వైసిపి ఇద్దరి హయాంలో ప్రాజెక్టు పనులు ఎక్కడివక్కడే ఆగి ఉన్నాయి. హంద్రీనీవా వెడల్పు పనులు అదే పరిస్థితి నెలకొంది. టిడిపి హయంలో కాలువ వెడల్పు 3800 ప్రవాహ సామర్థ్యం పెంచుతామని పనులు ప్రారంభించారు. అయితే వారి హయాంలో పూర్తవలేదు. వైసిపి అధికారంలోకి వచ్చాక దీని సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించి టెండర్లు సైతం పిలిచారు. కాని పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. పనులు పూర్తికాకపోవడం వలన గడిచిన మూడేళ్లుగా నీళ్లు పుష్కలంగా ఉన్నా నీటిని పూర్తి స్థాయిలో జిల్లాకు తీసుకురాలేకపోయారు. 25 టిఎంసిల్లోపే నీటిని తీసుకోగలిగారు.

పరిశ్రమల్లో మండుతున్న అటవీ సంపద

పట్టీపట్టనట్లు రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల తీరు



రాహుల్ బేరియం పరిశ్రమలో బాయిలర్ వద్ద అటవీ సంపద

ప్రజాశక్తి-హిందూపురం

పారిశ్రామిక అభివృద్ధి పేరుతో బంగారాన్ని పండించే రైతుల భూములను ప్రభుత్వం అడ్డుగోలుగా పారిశ్రామిక వేత్తలకు ధారదత్తం చేస్తోంది. ఆ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసిన పారిశ్రామిక వేత్తలు కొందరు అధికారులను మామూళ్ల మత్తులో ఉంచి, ప్రభుత్వ నిబంధనలకు నీళ్ల వదలి వారి పరిశ్రమల్లో అటవీ సంపదైన చెట్ల కలపను కాల్చేస్తున్నారు. ఈ విషయాలు తెలిసినా అటు రెవెన్యూ, ఇటు అటవీశాఖ అధికారులు వారిపై కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదు. శనివారం నాడు ప్రజాశక్తి హిందూపురం తూమకుటం పారిశ్రామిక వాడలోని రాహుల్ బేరియం రసాయన పరిశ్రమను పరిశీలించగా అక్కడ బాయిలర్‌ల వద్ద పెద్ద ఎత్తున కలప కన్పించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడులు పెద్దవి. ఇక్కడ దాదాపు 130కు పైగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో ఎక్కువ మందికి ఉపాదిని కల్పించే పరిశ్రమలతో పాటు తక్కువ మందికి ఉపాధినిచ్చేవి ఉన్నాయి. ఈ ప్రాంతంలో స్టీల్, రసాయన పరిశ్రమల వల్ల భూమి, వాతవరణం సైతం కాలుష్యం అవుతోంది. దీంతో ఈ మధ్య కాలంలో వెలసిన గార్మెంట్స్ పరిశ్రమల వల్ల భూమి కాలుష్యం పెరుగుతోంది. ఇదిచాలదన్నట్లు కాలుష్య చట్టాలతో పాటు వాల్టాచట్టానికి తూట్లు పొడచి, అటవీ సంపదను తెగ నరికి పరిశ్రమల్లో వినియోగిస్తున్నారు. అయినప్పటికీ అటు రెవెన్యూ, ఇటు అటవీ శాఖ అధికారులు అటు పక్క కన్నెత్తి చూడడం లేదు. ఈ పరిశ్రమలు చిమ్మే విషవాయువును నుంచి కాస్తా ఉపసమనం లభించాలంటే విరివిగా చెట్లను పెంచాల్సి ఉంది. దీని కోసం ప్రభుత్వాలు వివిధ పథకాల పేరుతో చెట్లను పెంచుతున్నారు. ఆ చెట్లను కొంత మంది స్వార్థపరులు నరికి, పరిశ్రమల వారికి కలప రూపంలో అమ్ముతున్నారు. వాస్తవానికి పరిశ్రమల్లో అటవీసంపదను వినియోగించడానికి లేదు. ఇలా వినియోగిస్తే అది నేరం కూడా. పురం పారిశ్రామిక వాడలో మాత్రం యధేచ్ఛగా కలపను వినియోగిస్తున్నారు. పరిశ్రమలో బాయిలర్ ఉంటే దానికి గనుల నుంచి లభించే బొగ్గు లేదా గ్యాస్‌ను వాడాల్సి ఉంది. వీటిని వినియోగిస్తే ఆర్థిక భారం అవుతుందన్న ఉద్దేశంతో యజమానులు అటవీ సంపదను వినియోగిస్తున్నారు. దీనిపై రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి, అటవీ సంపదను వినియోగించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని పారిశ్రామిక వాడ చుట్టుపక్కల ఉన్న రైతులు కోరుతున్నారు.

నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్



అభివృద్ధి పనులను పరిశీలన చేస్తున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అనుకున్న గడువులోగా పనులను పూర్తి చేయాలని గుత్తేదారులకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సూచించారు. శనివారం తెల్లవారు జామున పారిశుధ్య కార్మికుల హాజరు పరిశీలన చేసి వారికి తగు సూచనలు చేశారు. అనంతరం 32, 34వ వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘం వ్యాప్తంగా మురికివాడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇందులో భాగంగా రోజుమార్చి రోజు గ్యాగ్ వర్క్ ద్వారా మురుగు కాలువలను శుభ్రం చేయడం, దోమల నివారణ కోసం ఫాగింగ్, మురుగు కాలువల్లో దోమల నియంత్రణ మందును పిచికారీ చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎఈ నాగేంద్ర, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పందులను నియంత్రిస్తాం

పట్టణ వ్యాప్తంగా ఉన్న పందుల పెంపకం దారులు పందులను పట్టణంలో వదిలితే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. శనివారం నాడు తమిళనాడుకు చెందిన వారితో పట్టణంలోని నేతాజీనగర్, ధర్మపురం, మోడల్ కాలనీ, రహమత్ పురం, శ్రీకంతాపురం, మేళాపురం, చౌడేశ్వరికాలనీ, ముదిరెడ్డిపల్లి ప్రాంతాల్లో సంచరిస్తున్న పందులను పట్టి వాటిని సుదూర ప్రాంతాలకు తరలించారు. పందులు పట్టే సమయంలో పందుల పెంపకం దారులు అడ్డొచ్చి గొడవకు దిగారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు పోలీసుల సహకారంతో సుమారు 50 పందులను పట్టించి ఉరికి దూరంగా తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే పలు మార్లు పందుల పెంపకం దార్లకు పందులను వారి సంరక్షణలో ఉంచుకోవాలని సూచించామన్నారు. ఈ సూచనలు నిర్లక్ష్యం చేసి పందులను పట్టణంలో వదులుతుండడంతో వాటిని పట్టిస్తున్నట్లు చెప్పారు. ఇకపై పట్టణంలో సంచరించే పందులను పట్టి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించడంతో పాటు వాటి యజమానులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా వార్డులలో పందుల బెడద ఎక్కువ ఉంటే శానిటరీ ఇన్స్‌పెక్టర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు, ఆయా వార్డుల మేస్త్రీలు, వార్డు శానిటేషన్ సెక్రెటరీలు పాల్గొన్నారు.



బిఇఎల్ ఛైర్మన్ శ్రీవాత్సవతో మెట్టు గోవిందరెడ్డి

బిఇఎల్ ఛైర్మన్‌ను కలిసిన మెట్టు గోవింద రెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) బెంగళూరులో శనివారం ఏర్పాటు చేసిన విందులో ఏపీఐఐసీ ఛైర్మన్ మెట్టు గోవింద రెడ్డి పాల్గొన్నారు. బిఈఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భాను పి.శ్రీవాత్సవతో ఆయన మాట్లాడారు. వైఎస్.జగన్మోహన్ రెడ్డి నేతత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా శరవేగంగా అడుగులు ముందుకు వేస్తోందన్నారు. ఓ వైపు పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మరో వైపు సెజ్ (స్పెషల్ ఎకనామిక్ జోన్)లు, వాటిలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా పాలసముద్రం వద్ద 914 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగానికి చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్ పనులు వేగం జరుగుతున్నాయని చెప్పారు. ఐదు దశల్లో ఈ యూనిట్‌ను అభివద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే తొలి దశలో రూ.384 కోట్లతో అభివద్ధికి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. ఆగస్టు నెలలో పాలసముద్రంలో బీఈఎల్ సందర్శించి పనులను మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ వేగంగా కొనసాగుతుందన్నారు. అక్టోబర్ నెలలో పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో బీఈఎల్ డైరెక్టర్లు పార్థసారథి, వినయ్ కుమార్, మనోజ్ జైన్, దామోదర్, విక్రమాన్, కెవి.సురేష్ కుమార్, శివనాద్ యాదవ్, సంతోష్ కుమార్, శ్యామ సింగ్, ప్రఫుల్ల కుమార్ చౌదరి పాల్గొన్నారు.

నీళ్లు కాదు..నిధులు పారించారు..

ఏ మోహం పెట్టుకుని జిల్లాకు వస్తారు.?

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో ప్రాజెక్టులను నిర్మిస్తామన్న పేరుతో నీల్లు కాదు.. నిధులు పారించారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి టిడిపి నేతలను ఉద్దేశించి ఆరోపించారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై చేపట్టిన యాత్రపై ఆయన స్పందించారు. వారు అధికారంలోనున్న కాలంలో సాగునీటి ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రూ.60 వేల కోట్లతో ప్రాజెక్టులు చేపడుతున్నామన్న పేరుతో డబ్బులు దండుకున్నారని విమర్శించారు. వారు సరైన పద్ధతిలో నిధులు ఖర్చు చేసి ఉంటే ఈపాటికి ప్రాజెక్టులన్నీ పూర్తయ్యి రాయలసీమ సస్యశ్యామలం అయ్యేదని చెప్పారు. బిటిపి ప్రాజెక్టు కింద భూసేకరణకు నిధులిచ్చింది తమ ప్రభుత్వమని చెప్పారు. ఏ మోహం పెట్టుకుని ఈ ప్రాంతానికి వస్తున్నారని చంద్రబాబును ఉద్దేశించి విమర్శించారు. వారి ఐదేళ్ల కాలంలో దోచుకోవడం తప్ప ప్రాజెక్టులు చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రకృతి కరుణించి జిల్లాలో వర్షాలు బాగా వచ్చి ఎక్కడ చూసినా పచ్చదనం ఉందన్నారు. మీరొస్తే మరోమారు క్షామం తప్పదని ఎద్దేవా చేశారు.

పౌష్టికాహారం, పండ్లు పంపిణీ

హిందూపురం : ఇమామే హసన్, ఇమామ్ హుస్సేన్ సహ పలువురి బలిదానాలను స్మరిస్తూ, ఇస్లామిక్ నూతన ఏడాది ఆరంభంమైన మొహరం పురస్కరించుకుని శనివారం నాడు ముస్లిం సోదరులు సేవా మందిరంలో క్రైస్తవులు నిర్వహిస్తున్న వద్ధాశ్రమంలో పౌష్టికాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రజాస్వామ్య పునరుద్ధరణకు నియంతలపై జరిగిపన పోరాటానికి ప్రతిరూపంగా మొహరంను చెప్పవచ్చన్నారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం 14వ శతాబ్ధం క్రితమే మానవ హక్కుల కోసం జరిగిన చరిత్రత్మక పోరాటం మొహరం అన్నారు. ఈ పోరాటంలో మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామే హుస్సేన్ బలిదానం అనంతరం మూడవ రోజు షహాదత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమర్ ఫారూక్ ఖాన్, ముఫ్తీ ఇబ్రహీం, హాఫిజ్ ఇలియాజ్, సాదిక్, చాందు, ఉబెదుల్లా హుస్సేన్, కౌన్సిలర్ ఇర్షాద్ అహ్మద్, ముతవల్లీ అన్సార్, అస్లాం, ఇదరీస్, జనవిజ్ఞాన వేదిక అతావుల్లా, అబుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్లు విడుదల

హిందూపురం : రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఆగస్టు 7వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చలపతి, వినోద్ కుమార్ తెలిపారు. చలోకు సంబంధించిన గోడ పత్రికలను స్థానిక పట్టు గూళ్ల మార్కెట్ ఆవరణంలో రైతులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట సాగు చేస్తున్న ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. అన్ని పంటలకూ మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కృష్ణ, ముత్యాలప్ప, శ్రీరాములు, నర్సింహులు, నారాయణప్ప, అక్కులప్ప పాల్గొన్నారు.



జనసమూహం మధ్య అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న స్వామివారు

కన్నుల పండువగా కుళ్లాయిస్వామి అగ్నిగుండ ప్రవేశం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అగ్నిగుండ ప్రవేశం కన్నుల పండువగా సాగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున మూడు గంటల నుంచి పురవీధుల గుండా స్వామివారిని ఊరేగించారు. ఉదయం 6.30 గంటల సమయంలో భక్తుల జనసందోహం మధ్య స్వామివారు అగ్నిగుండ ప్రవేశం చేశారు. స్వామివారి అగ్నిగుండ ప్రవేశ సమయంలో కుళ్లాయిస్వామి గోవిందా.. అంటూ భక్తుల నినాదాలతో గూగూడు దద్దరిల్లింది. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం కుళ్లాయిస్వామి జలదికి తరలించారు. కాగా సోమవారం రాత్రి కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ముల్లాసాబ్ హుస్సేన్‌ప్ప, ఆలయ కార్యనిర్వహణాధికారిణి శోభ తెలిపారు. కాగా భారీగా కందూరీలు (జంతు బలి) చేసి మొక్కలు తీర్చుకున్నారు.

జనసేన ఆధ్వర్యంలో 'జగనన్న కాలనీ' పరిశీలన

ప్రజాశక్తి-మడకశిర

జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇళ్లు పేదలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయని జనసేన పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జనసేన ఆధ్వర్యంలో శనివారం స్థానిక పావగడ రోడ్డులోని జగనన్న కాలనీని సందర్శించి లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ ప్రధాన రోడ్డు బురద, గుంతలమయమైందని, డ్రైనేజీ, విద్యుత్, నీటి వసతి లేదని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వానికి స్వస్తి చెప్పే దిశగా జనసేన పార్టీ ప్రతి సమస్యని ఎత్తిచూపుతుందన్నారు. జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు టిఎ శివాజీ, కుమార్, నాగేంద్ర, హరి, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాలంటీర్ పై చర్యలు తీసుకోండి

పరిగి : మండల పరిధిలోని పాత్రగాని పల్లికి చెందిన వాలంటీర్ సునీల్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం పలువురు పాత్రికేయులు ఎస్ఐ నరేంద్రకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం జనసేన పార్టీ నాయకులు గుంతలు పడిన రహదారిలో వరి నాట్లు వేసి నిరసన తెలిపిన వార్తను పత్రికల్లో ప్రచురితం చేశారన్నారు. దీంతో వాలంటీర్ సునీల్ సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా జర్నలిస్టులు, యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులపై అసభ్య పదజాలంతో పోస్టు పెట్టడం మీడియాను అవమానపరిచినట్లే అన్నారు. కావున అతడిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో న్యూస్ ఛానల్ నిర్వాహకులు, శివశంకర్, మహేష్, జియాఉల్లా, గోపాల్, రామకృష్ణ ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రేపు 'మహాశక్తి'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మడకశిర

మండల పరిధిలోని గౌడనహళ్లిలో ఈ నెల 31వ తేదీ చేపట్టనున్న మహాశక్తి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనావారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాశక్తి కార్యక్రమాన్ని ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు గౌడనహళ్లిలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. కావున పట్టణంతో పాటు మండలంలోని మహిళలు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు గుండె వైద్యశిబిరం

సోమందేపల్లి : మండల పరిధిలోని రంగేపల్లి గ్రామంలో ఆదివారం(నేడు) ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచి నరసింహమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కిమ్స్ సవేరా వైద్యులచే ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అన్నదానానికి 'బత్తల' సాయం

కదిరి టౌన్ : పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న నానా దర్గా వద్ద మొహరం వేడుకలు పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమానికి శనివారం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ. 10వేలను వైసిపి పట్టణ అధ్యక్షుడు ద్వారా పీర్ల పండుగ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జిలాన్‌బాషా, హమీద్, జఫ్రోలు, ముజఫర్, ముజమిల్, బాబా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానంపై అవగాహన

లేపాక్షి : జాతీయ విద్యా విధానం మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం స్థానిక నవోదయ పాఠశాలలో ప్రధాని మోడీ ఉపన్యాసాన్ని విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా జాతీయ విద్యా విధానం వల్ల ఉన్న లాభాలను తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

పుట్టపర్తి అర్బన్ : ఈ నెల 31 నుంచి పుట్టపర్తి నుంచి అరుణాచలంకు స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఈనయతుల్లా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు పుట్టపర్తి నుంచి బస్సు బయల్దేరుతుందన్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణతో పాటు వేలూరు గోల్డెన్ టెంపుల్, కాణిపాకం వినాయకుడి దర్శనం చేయిస్తారన్నారు.

ఆదుకోవాలని వికలాంగుని వేడుకోలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్



తిరుమలేష్

విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, కుటుంబ పోషణ కూడా భారమైందని ఆదుకోవాలని పుట్టపర్తి పట్టణానికి చెందిన దివ్యాంగుడు తిరుమలేష్ వేడుకున్నాడు. వినికిడి లోపం ఉన్న తిరుమలేష్ గత వారం ఇంటిలో విద్యుత్ షాక్‌కు గురై ఆసుపత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతడు టైలరింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య కూడా దివ్యాంగురాలు కావడంతో రోజు గడవడం కష్టంగా మారింది. ప్రభుత్వం సహాయం చేయాలని, దాతలెవరైనా ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

మణిపూర్‌లో తక్షణమే మారణహోమాన్ని ఆపి, శాంతిని నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఆ దుర్ఘటనలకు నిరసనగా శనివారం పట్టణంలోని వికలాంగుల భవనంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, ఆర్‌సిపి, టిడిపి, బిఎస్‌పి, కాంగ్రెస్, ఆర్ఎస్‌వైఎఫ్, ఎఐఎస్ఎ, రాయలసీమ మహిళా సంఘం, ఆప్కి ఆవాజ్, గిరిజన, ప్రజాసంఘాలు, కలిసి ఫాసిస్టు వ్యతిరేక పోరాట కూటమిగా ఏర్పడ్డాయి. ముందుగా మణిపూర్ మారణకాండలో మరణించిన వారికి సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మణిపూర్ సిఎం అండదండలతోనే అక్కడ మారణకాండ జరిగిందని, వెంటనే అక్కడి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి హంతకుల ముఠాను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌సిపి జిల్లా కార్యదర్శి డాక్టర్ నాగన్న, కదిరి నియోజకవర్గ కార్యదర్శి టిఎండి ఇలియజ్, సిపిఎం నాయకులు జగన్, టిడిపి పట్టణ కార్యదర్శి డైమండ్ ఇర్ఫాన్, బిఎస్‌పి కదిరి నియోజకవర్గ అధ్యక్షులు కోలా బెనర్జీ, ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అరుణ్‌కుమార్, ఎఐఎస్ఎ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నరసింహా, ఎపివైఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు కంప రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇందాదుల్లా, హ్యూమన్ రైట్స్ ఉబేదుల్లా ఖాన్, మంగలి మహాసభ కదిరి కన్వీనర్ కే.మునికుమార్, హరిప్రసాద్, రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.సుగుణమ్మ, ఆర్‌సిపి ఎన్‌పి కుంట మండల కార్యదర్శి అంజి, పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

మణిపూర్‌లో ఆకత్యాలను వెంటనే అరికట్టాలి

లేపాక్షి : మణిపూర్‌లో అత్యాచారాలు, ఆకత్యాలను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఎంఐఎం పార్టీల ఆధ్వర్యంలో స్థానిక లేపాక్షి నంది దగ్గరి నుంచి ర్యాలీగా అంబేడ్కర్ కూడలి చేరుకొని విగ్రహానికి పూలమాల వేసి వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైన సిపిఎం నాయకులు ప్రవీణ్‌కు మార్, అఖిల పక్షం నాయకులు మాట్లాడుతూ దేశంలో గిరిజన, ఆదివాసీలు, దళితులు, ముస్లిం, క్రిస్టియన్లు, బడుగు, బలహీన వర్గాల మీద దాడులు ఎక్కువయ్యాయన్నా రు. పార్లమెంట్‌లో మణిపూర్ ఘటనపై చర్చించడం కూడా చేతకాని ప్రధాని మోదీకి దేశాన్ని పాలించే హక్కు లేదన్నారు. మణిపూర్ సిఎం, ప్రధాని ఇద్దరూ పదవులకు రాజీనామా చేయాలని, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ఇంత జరుగుతు న్నా చంద్రబాబు, జగన్, పవన్‌కి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో భావసారూప్యత కలిగిన ప్రజాస్వామ్య పార్టీలు కలుపుకొని బిజెపి, టిడిపి, వైసిపిలను అధికారంలోకి రాకుండా చేస్తామని హెచ్చరించారు. అనంతరం బిజెపి దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ రామాంజనేయులు, బాలాజీ, మనోహర్, అమానుల్లా, జమీల, సిపిఎం నాయకులు వెంకటేష్, లక్ష్మి, సరస్వతి, సిపిఐ నాయకులు శివప్ప, గోవిందరెడ్డి పాల్గొన్నారు.



లేపాక్షిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఎంఐఎం పార్టీల నాయకులు

నేరాలు ఘోరాలు

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-పెనుకొండ



అఖిల(ఫైల్‌ఫోటో)

మండల పరిధిలోని రాంపురం పంచాయతీ మరువపల్లి గ్రామానికి చెందిన అఖిల(19) ఆత్మహత్యకు పాల్పడింది. పెనుకొండ ఎస్ఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. అఖిల శుక్రవారం రాత్రి ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన గోవర్ధన్, అఖిల రెండేళ్లుగా ప్రేమించుకున్నారని, గోవర్ధన్ పెళ్లికి నిరాకరించడంతో అఖిల ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. అఖిల తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వంటగ్యాస్ లీకై చెలరేగిన మంటలు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

మండల పరిధిలోని వంగంపల్లి గ్రామంలో గంగమ్మ ఆలయ పూజారి మాధవరాజు నివాసంలో శనివారం వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో అతడి భార్య రాజేశ్వరి తీవ్రంగా గాయపడింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. మాధవరాజు ఇంట్లో శుక్రవారం రాత్రి వంట గ్యాస్ నిండు సిలిండర్‌ను స్టవ్‌కు అమర్చారు. శనివారం ఉదయం వంటింటి గోడ సమీపంలో రాజేశ్వరి నీళ్లు కాచేందుకు కట్టెలపొయ్యిని వెలిగించగా మంటలు చెలరేగి ఇల్లంతా వ్యాపించాయి. ఆ మంటల్లో నుంచి రాజేశ్వరి కేకలు వేసుకుంటూ బయటికి రాగా స్థానికులు మంటలను అదుపు చేశారు. అప్పటికే రాజేశ్వరి తీవ్రంగా గాయపడడంతో పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అనంతపురం తరలించారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. ప్రమాదంలో దుస్తులు, బియ్యం, ఇతర వస్తువులు కాలి బూడిద కాగా ఇల్లు పూర్తిగా ధ్వంసమై రూ. 10 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సాయం కింద కొంత ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాద జరిగిన స్థలాన్ని గ్యాస్ కంపెనీ సిబ్బంది పరిశీలించి ఎలా సంభవించిందో ఆరా తీశారు. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్ రామాంజనేయు లు, పుట్టపర్తి రూరల్ సిఐ రాగిరి రామయ్య, ఎస్ఐ లింగన్న, సిబ్బంది పరిశీలించారు. మాధవరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచి శ్రీనివాసులు కోరారు. బాధితురాలు రాజేశ్వరిని మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తి నుంచి కర్నూలుకు తరలిస్తున్న తరుణంలో మార్గమధ్యలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

'కడప ఉక్కు'పై కేంద్రానిది పచ్చి మోసం

31న కలెక్టరేట్ వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 31వ తేదీ చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో నాయకులు ఇంతియాజ్, ఈఎస్ వెంకటేష్, రామకృష్ణ, సిద్దు ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. అలాగే పుట్టపర్తి, ప్రశాంతి గ్రామ్, ఎనుమలపల్లి, మామిళ్లకుంట క్రాస్‌లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం కరువు సీమ కాదు.. ఖనిజ సంపద గల సీమ అన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఇక్కడి ప్రజల చిరకాల ఆకాంక్ష అని, అయితే రెండు దశాబ్దాల్లో నాలుగు పర్యాయాలు శంకుస్థాపనలు చేశారని విమర్శించారు. భూగర్భంలో ఎనలేని ఖనిజ సంపద ఉన్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం రెండుసార్లు శంకుస్థాపనలు చేసిందే కానీ విభజన చట్టంలో భాగంగా ఉన్న కడప ఉక్కును సాధించడానికి కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలమైందన్నారున. రాయలసీమకు బిజెపి ద్రోహం చేసిందన్నారు. విభజన చట్టంలో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమ, అనంతపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, భెల్, నాసన్ పరిశ్రమలు, టెక్స్‌టైల్స్ పార్కు, కర్నూలులో రూ. 400 కోట్లతో ట్రిపుల్ ఐటీ, రైల్వే కోచ్ నిర్మాణ పరిశ్రమ, తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు చిత్తూరు, చెన్నై, విశాఖ, పారిశ్రామిక కారిడార్ నిర్మాణం పదేళ్ల లోపు పూర్తి చేయాలని ఉందని, కానీ ఒక్క హోదా కూడా పూర్తి కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కడప ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 31వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో ప్రజలు, కార్మికులు, ప్రజాతంత్రవాదులు, యువత అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

అధ్వానంగా చోళగిరి-మల్లినమడుగు రోడ్డు

ప్రజాశక్తి-మడకశిర



చోళగిరి-మల్లినమడుగు రోడ్డులో గుంతలు

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు పదేపదే తెలియజేస్తున్నా నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో గుంతలుపడిన రోడ్లు దర్శనమిస్తున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం చోళగిరి నుంచి రొళ్ల మండలంలోని మల్లినమడుగుకు దాదాపు 3 కి.మీ మేర రోడ్డు అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు పేర్కొంటున్నారు. ఆ రోడ్డు వేసి 15 ఏళ్లు కావడంతో గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మరమ్మతులకు నోచుకోలేదు. ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి-కదిరి టౌన్



మొక్కలు నాటిస్తున్న భాస్కర్‌రెడ్డి

మొక్కలు నాటడం ద్వారా పర్యావరణా న్ని కాపాడుదామని పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఐ ఆధ్వర్యంలో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ స్టేషన్ పరిసరాల్లో ఆహ్లాద వాతావరణం ఉండేలా మొక్కలు నాటించామని తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కల పెంపకం చేపట్టాలని, ఎవరైనా వాల్టా చట్టం అతిక్రమించి చెట్లు కొడుతుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి చెట్ల పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత సమాజంలో ప్రతిఒక్కరిపై ఉందని ఆర్‌డిటి ఎకాలజీ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దాసప్పనపాలెం గ్రామ పొలిమేరలో శనివారం ఆర్‌డిటి ఆధ్వర్యంలో 1000 ఎర్రచదనం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆర్‌డిటి ప్రతినిధులు మాట్లాడుతూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. కాలుష్య నియంత్రణ పాటిద్దామని పిలుపునిచ్చారు. మొక్కలను నాటి సంరక్షించడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు జంతువులు, పశుపక్షాదులకు నీడనిస్తాయన్నారు. అలాగే అనేక రకాల ఉపయోగాలు ఉంటాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రతి ఇంటి ముందు, కొండలు, గుట్టలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మడకశిర సెక్టార్ టీం లీడర్ వెంకటేశులు, ఎస్‌టిఓ చంద్రశేఖర్, అనిల్, సర్పంచి హరీష్, ఎంపిటిసి లింగరాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడపగడపకూ'

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో పర్యటించి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగన్ ప్రభుత్వంలో దళారీల బెడద లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ ఛైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, తిప్పన్న, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మాధవరెడ్డి, గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నల్లచెరువు :మండల పరిధిలోని నల్లచెరువు-2 గ్రామ సచివాలయం పరిధిలోని నల్లచెరువు రైల్వేగేట్, కమ్మవారిపల్లి, యనుముల వారిపల్లి, పులిమివారిపల్లి, పత్రవాండ్లపల్లిలో శనివారం ఎమ్మెల్యే సిద్ధారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేకి గ్రామ ప్రజలు పూలమాలలు, మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అనంత రం ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రసల సమస్యలను తెలుసుకొని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నేటితో మండలంలో ముగిసిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత పెద్దఎత్తున విజయవంతం చేసిన అధికారులు, వైసిపి శ్రేణులను అభినందించా రు. కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి , వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, కో ఆప్షన్ సభ్యులు, జెసిఎస్ ఇన్‌ఛార్జులు, సర్పంచులు, వివిధ శాఖల ఛైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

రొద్దం : జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని కనుమర్ర, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఆ రెండు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందాయా లేదా అని ఆరా తీశారు. అలాగే వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులతో పాటు ఎంపిపి చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మారుతిరెడ్డి, రాజారెడ్డి, తిమ్మయ్య, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

'మహాశక్తి'తో మహిళల అభ్యున్నతి

ప్రజాశక్తి-బుక్కపట్నం

మహిళా అభ్యున్నతికి టిడిపి మహాశక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మల్లిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బుచ్చయ్యగారిపల్లి, జానకంపల్లి, తదితర గ్రామాల్లో శనివారం టిడిపి ఆధ్వ ర్యంలో మహాశక్తి మేనిఫెస్టోపై ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్యగౌడ్, వెంకటరాముడు, నాయకులు సయ్యద్ బాషా, నారాయణస్వామి, గంగాధర్, సామకోటి ఈశ్వరయ్య, కేశవనాయుడు, తెలుగు యువత నాయకులు సుధీర్, శ్రీనివాస్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

మహాశక్తి మేనిఫెస్టో మహిళలకు వరం

నల్లచెరువు : మహాశక్తి కార్యక్రమంలో భాగంగా టిడిపి ఆధ్వర్యంలో మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లి గ్రామ పంచాయతీ దేవిరెడ్డి పల్లిలో ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, సర్పంచి హర్షవర్ధన్ నాయుడు, పర్వీన్‌బాను, తెలుగు యువత గుత్తా ప్రసాద్, హర్షవర్ధన్‌నాయుడు, అంజనప్ప, సతీష్‌చౌదరి, తిరుపాలు, ఎస్సీ సెల్ శ్రీనివాసులు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



బుక్కపట్నం మండలంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

'ఉపాధి' బిల్లులు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండలంలో ఉపాధి హామీ పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందని, వెంటనే బిల్లులు చెల్లించాలని టిడిపి మండల కన్వీనర్ వల్లిపి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులు ప్రవేశపెడితే ఆ నిధులను సైతం పక్కదారి పట్టిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. కుటుంబ పోషణ కోసం పనులకు వెళ్లిన కూలీలకు మూడు నెలలైనా బిల్లులు చెల్లించకపోతే వారి జీవనం ఏమవ్వాలని ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.జ 500 వేతనం చెల్లించాలని, పని ప్రదేశంలో టెంట్లు వేయాలని, మెడికల్ కిట్లు, పనిముట్లు అందించాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఒక్కో మస్టర్‌కు ఒక్కో రేటు పెట్టి కూలీల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా కూలీలకు పని చేసిన వారంలోపే డబ్బులు చెల్లించాలని, పనులు కల్పించి వలసలను ఆపాలని డిమాండ్ చేశారు.

వంకలు, వాగుల్లో ఇంటిపట్టాలిచ్చారు : చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వంకలు, వాగుల్లో ఇంటిపట్టాలిచ్చి పేద ప్రజలను సిఎం జగన్ మోసం చేశారని జన సేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. మండల పరిధిలోని కుణుతూరు లేఔట్‌లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ఎన్నికలకు ముందు స్థలాలతో పాటు ఇంటి నిర్మాణాలు చేపట్టి తాళాలు ఇస్తామని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కారన్నారు. జగనన్న కాలనీల్లో ఎక్కడ చూసినా గుంతలు, బురద రోడ్లు దర్శనమిస్తున్నాయన్నారు. పునాదుల్లో నీరు నిల్వ ఉండటంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి నెలకొందన్నారు.



కుణుతూరు లేఔట్ నీటిలో నిరసన తెలుపుతున్న చిలకం

జిల్లాకు జగన్ చేసింది శూన్యం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి-మడకశిర

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగనీరు అందిస్తామని హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాకు చేసిన అభివృద్ధి శూన్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగానికి జీవనాధారమైన హంద్రీనీవా ప్రాజెక్టుకు టిడిపి హయాంలో చంద్రబాబు రూ. 1100 కోట్లు ఖర్చుపెట్టి కాలువ విస్తరణ పనులను 45 శాతం పూర్తి చేశారన్నారు. అయితే జగన్ కాలువ సామర్థ్యాన్ని 6000 క్యూసెక్కులకు పెంచుతామని, ప్రధాన కాలువకు సమాంతరంగా మరో కాలువ తవ్వి 10,000 క్యూసెక్కుల వరద నీటిని తరలిస్తామని ప్రగల్భాలు పలికి గంపెడు మట్టి కూడా తీయలేకపోయారన్నారు. మడకశిర బ్రాంచి కెనాల్ పనులు పూర్తిగా ఆగిపోయాయన్నారు. నియోజకవర్గంలోని రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్ల నిర్మాణం అటకెక్కిందన్నారు. జీడిపల్లి బైపాస్ కెనాల్ కార్యరూపం దాల్చలేదన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని 114 చెరువులను కృష్ణా జలాలతో నింపేందుకు తలపెట్టిన భైరవాణితిప్ప ప్రాజెక్టు పనులను ఆపేసి ఆ రెండు నియోజకవర్గాల రైతుల గొంతు నులిమారని మండిపడ్డారు. జీడిపల్లి, పేరూరు ప్రాజెక్టు పనులను రద్దు చేశారన్నారు. తుంగభద్ర హై లెవెల్ ఆధునీకరణ పనులకు నాలుగేళ్లలో కనీసం రూపాయి కూడా కేటాయించ లేదన్నారు. కర్నాటకలో తుంగభద్ర జలాశయం ఎగువన కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టు వల్ల రాయలసీమ ఎడారిగా మారే అవకాశం ఉన్నప్పటికీ, ఆ ప్రాజెక్టు బ్రిజేష్‌కుమార్ ట్రిబునల్ తీర్పుకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ కేసుల భయంతో సిఎం జగన్ నోరెత్తడం లేదని మండిపడ్డారు.

నేడు కార్మిక, కర్షక, రైతు సదస్సు

తనకల్లు : కేంద్ర ప్రభుత్వం రైతుల నడ్డి విరిచేలా మూడు నల్లచట్టాలు తెచ్చిందని, వాటిని రద్దుచేసేంత వరకూ రైతులు ఐక్యంగా పోరాడాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయంలో సిపిఎం ఆధ్వర్యంలో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 4 లేబర్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. ప్రజాస్వామిక విధానాలను రాజకీయ లబ్ధి కోసం లౌకిక విధానాలకు భంగం కలిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ న్యాయపోరాటం చేస్తామన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని వీటన్నింటిపై పోరాడడానికి వేదిక ఏర్పాటైందని, ఈ వేదిక ద్వారా రైతులు, కార్మికులు, కర్షకులు ఏకమై ఈ నెల 30వ తేదీ జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గోరంట్ల : పట్టణంలోని మూడో వార్డులో సాధిక్ లాడ్జి వెనుక శివాలయానికి వెళ్లే దారి సీసీ రోడ్డు పనులకు శనివారం సర్పంచి సరోజనాగేనాయక్, ఉప సర్పంచి రాజారెడ్డి భూమి పూజ చేశారు. గోరంట్ల మేజర్ గ్రామపంచాయతీలో రూ. కోటి ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచి తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి జయరామ్‌నాయక్, వార్డ్ మెంబర్ మేదర శంకర, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ నూర్‌మహమ్మద్, ఆసుపత్రి ఛైర్మన్ చింతా రామచంద్రారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్ బాల్ శిక్షణ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో స్పెయిన్ బాస్కెట్ బాల్ కోచ్‌లు పది రోజుల నుంచి నిర్వహించిన శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. కోచ్‌లు ఈ నెల 18వ తేదీ నుంచి బాస్కెట్ బాల్ క్రీడపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమానికి వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బాస్కెట్‌బాల్‌పై స్పెయిన్ కోచ్‌లు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో బాలికలు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, సెక్రటరీ వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

మడకశిర : మండలంలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులపై సమగ్ర విచారణ చేపట్టాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు హాజరవని వారి ఖాతాలో నగదు జమపై అనుమానాలు ఉన్నాయని, కావున నియోజకవర్గ వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఉపాధి నిధులు కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులకు లాభయదాయకంగా మారాయన్న ప్రచారం జరుగుతోందని విమర్శించారు.